# ఆడిట్ విధివిధానాలు

## 2.1 నేపథ్యం

2004-10 మధ్య కాలంలో నిర్వహించిన వివిధ ఆడిట్‌లలో, ఎంపికచేసిన కొన్ని జలయజ్ఞం ప్రాజెక్టుల్లోని పలు అంశాలను గతంలో పరిశీలించడమైంది. రాష్ట్ర శాసన సభకు సమర్పించిన ఆడిట్ సమీక్షా ఫలితాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

- 2006-07 ఆడిట్ నివేదికలో, 'గోదావరీ జలాల వినియోగ అథారిటీ'లో భాగంగా ఏడు ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై ఆడిట్ సమీక్ష.
- 2008-09 ఆడిట్ నివేదికలో, 'మూడో పక్ష నాణ్యత నియంత్రణ'పై ఆడిట్ పేరా, భారత ప్రభుత్వ ఆర్థిక సాయంతో చేపట్టిన 'సత్వర సాగునీటి ప్రయోజన కార్యక్రమం'పై ఆడిట్ సమీక్ష (ఇందులో జలయజ్ఞంలోని ఎనిమిది ప్రాజెక్టులున్నాయి).
- 2009-10 ఆడిట్ నివేదికలో, 'కల్వకుర్తి ఎత్తిపోతల పథకం'పై ఆడిట్ సమీక్ష, మొబిలైజేషన్ అడ్వాన్సులు, మరో నాలుగు ఇతర ప్రాజెక్టులకు సంబంధించి, ఎంపిక చేసుకున్న అంశాలపై ఆడిట్ పేరాలు.

ఈ ఆడిట్ నివేదికలలోని ముఖ్యమైన అంశాలనూ, ప్రభుత్వానికి ఆడిట్ చేసిన సిఫార్సులనూ ***అనుబంధం - 2.1***లో పేర్కొనడమైంది. రాష్ట్ర శాసనసభకు చెందిన ప్రజా పద్దుల సంఘం ఈ ఆడిట్ నివేదికలు/పేరాలపై ప్రస్తుతం చర్చిస్తోంది.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలోని జాప్యాలు; ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన భూసేకరణ, కేంద్ర జల సంఘం, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పర్యావరణ - అటవీ మంత్రిత్వ శాఖల అనుమతులు వంటి వివిధ కార్యకలాపాల మధ్య సమన్వయలేమి; హెడ్‌వర్క్స్ చేయకుండానే కాలువల తవ్వకం; పనుల పరిధి, స్పెసిఫికేషన్లు, అంచనాల్లో మార్పులు చోటుచేసుకున్నప్పుడు తీసుకోవలసిన చర్యలకు సంబంధించిన నిబంధనలను ఒప్పందాల్లో చేర్చకపోవడం వంటి అంశాలను ఈ ఆడిట్ నివేదికలు, పేరాలలో ప్రధానంగా ప్రస్తావించడమైంది. పనుల్లో మార్పులకు సంబంధించిన నిబంధనలు ఈపీసీ[1] కాంట్రాక్టులకు వర్తించవనీ, వివిధ కార్యకలాపాల మధ్య సమన్వయం ఉండాలన్నా, ప్రాజెక్టు పనుల ప్రారంభానికి ముందే వివిధ అనుమతులను పొందాలన్నా ప్రాజెక్టు గడువులను పొడిగించాల్సి ఉంటుందన్న వైఖరిని ప్రభుత్వం తీసుకుంది.

రాష్ట్ర ప్రభుత్వం జలయజ్ఞం కింద చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులలో 26 ప్రాజెక్టులకు సంబంధించి స్థూల స్థాయి ప్రణాళికా రచన, నీటి లభ్యత, ప్రాజెక్టుల నిర్వహణకు తగిన విద్యుత్తు లభ్యత, ప్రతి ప్రాజెక్టు తాలూకు సమగ్ర ప్రణాళిక, పలు ప్యాకేజీల టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టుల నిర్వహణ, ప్రాజెక్టుల అమలుతో సహా అన్ని ముఖ్యాంశాలపైనా ప్రస్తుత ఆడిట్‌లో సమగ్రంగా సమీక్షించడం జరిగింది.

## 2.2 ఆడిట్ లక్ష్యాలు

ఈ కింది అంశాలను మదింపు చేయడానికి జలయజ్ఞం కార్యక్రమాన్ని ఆడిట్‌లో సమీక్షించడం జరిగింది :

- ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళికను సమగ్రంగా రూపొందించడం జరిగిందా, ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రణాళికను సరైన విధంగానే రూపొందించడం జరిగిందా,

[1] ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్

- ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అన్ని స్థాయిల్లోనూ టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టుల నిర్వహణలో ఆర్థిక ఔచిత్య సూత్రాలనూ, పారదర్శకతనూ పాటించడం జరిగిందా;
- నిర్ణీత వ్యవధిలోనూ, బడ్జెటులో అంచనా వేసుకున్న ఖర్చుకు మించకుండానూ ప్రాజెక్టులను నిర్వహించడం జరిగిందా; లక్ష్యాల మేరకు ఆయకట్టును ఏర్పాటు చేయడం జరిగిందా.

## 2.3 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్ పరిశీలనకు ఈ కింది అంశాలను ప్రామాణికంగా తీసుకోవడం జరిగింది :

- ఏపీ ఫైనాన్షియల్ కోడ్, ఏపీ పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ కోడ్;
- ఈపీసీ కాంట్రాక్టులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, ఆదేశాలు, సర్క్యులర్లు;
- ఈపీసీ టర్న్‌కీ ప్రాజెక్టులకు సంబంధించి, 'కన్సల్టింగ్ ఇంజనీర్ల అంతర్జాతీయ సమాఖ్య (ఫిడిక్)' రూపొందించిన నిబంధనలు;
- కేంద్ర జలసంఘం, ప్రణాళికా సంఘం, కేంద్ర పర్యావరణ - అటవీ మంత్రిత్వ శాఖ, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖల మార్గదర్శకాలు;
- ప్రాజెక్టుల సమగ్ర నివేదికలు (డీపీఆర్‌లు), ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాల అధ్యయన నివేదికలు, అంతర్గత అంచనాలు (ఐబీఎమ్‌లు);
- వార్షిక కార్యాచరణ ప్రణాళికలు, ఫలితాల బడ్జెట్‌లు;
- పునరావాసం, పునర్నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాలు;
- కృష్ణా, గోదావరీ నదుల జల వివాదాల ట్రిబ్యునళ్ళ అవార్డులు, అంతర్ రాష్ట్ర ఒప్పందాలు.

## 2.4 ఆడిట్ పరిధి


జలయజ్ఞం కార్యక్రమాన్ని 2011 జూన్ - డిసెంబరు మధ్యకాలంలో ఆడిట్ చేయడమైంది. 2004-05 లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి 2011-12 వరకు (2011 డిసెంబరు వరకు) జరిగిన లావాదేవీలను ఆడిట్‌లో పరిశీలించడమైంది. నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షానంతర సమావేశంలో జరిగిన చర్చల ఆధారంగా, ఈ శాఖాధికారులు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానాలు, వారు అందజేసిన తదనంతర సమాచారం, పురోగతి నివేదికల ఆధారంగా ఈ నివేదికలోని అంకెలు తాజా స్థితిని తెలిపేలా రూపొందించడం జరిగింది. కొత్త ఆయకట్టును ఏర్పాటు చేయడం, ప్రస్తుత ఆయకట్టును స్థిరీకరించడం, తాగునీటి సౌకర్యాన్ని కలిగించడం, విద్యుదుత్పాదన చేయడం అనేవి జలయజ్ఞం లక్ష్యాలు అయినా, ఈ ఆడిటు సమీక్షలో సాగునీటి ప్రాజెక్టులపైనే ప్రధానంగా దృష్టి సారించడమైంది.

## 2.5 ఆడిట్ నిర్వహణలో అనుసరించిన పద్ధతి

ప్రభుత్వ నిర్ణయాలు, తీర్మానాలు, విధివిధానాలు, ఆదేశాలు, బడ్జెటు కేటాయింపులు మొదలైన వాటిని డిపార్ట్‌మెంటు స్థాయిలోనూ, ఎంపిక చేసుకున్న ప్రాజెక్టుల్లోని అంచనాలు, టెండర్ల ప్రక్రియలు, చెల్లింపులు, నాణ్యతా నియంత్రణ మొదలైన వాటిని డివిజన్లు/సర్కిళ్ళ స్థాయిలోనూ, నిర్మాణ స్థలాల వద్దా పరిశీలించడం ద్వారా ఆడిట్ నిర్వహించడమైంది. వివిధ స్థాయిల్లో నీటి పారుదల - ఆయకట్టు అభివృద్ధి శాఖ అధికారులతో చర్చలు జరపడం, అవసరమైన చోట్ల ప్రశ్నావళులను జారీచేయడం, ఫోటోలను సేకరించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నీటిపారుదల - ఆయకట్టు

అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శులతో 2011 మే లో జరిగిన సమీక్షారంభ సమావేశంలో ఆడిట్ లక్ష్యాలు, పరిధి, ఆడిట్ నిర్వహణా పద్ధతులు, ప్రామాణికాంశాలు మొదలైన వాటి గురించి చర్చించి వారి అభిప్రాయాలను పొందడం జరిగింది. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు సంబంధించిన ముఖ్య కార్యదర్శులతో 2012 జూలైలో జరిగిన సమీక్షానంతర సమావేశంలో ఆడిట్‌లో కనుగొన్న విషయాలను చర్చించడమైంది. ప్రభుత్వ సమాధానాలను, రాతపూర్వకంగా ఇచ్చిన జవాబులను ఈ నివేదికలో తగిన చోట్ల పొందుపర్చడం జరిగింది.

### 2.5.1 ఆడిట్ నమూనా ఎంపిక




జలయజ్ఞం కింద చేపట్టిన మొత్తం 74 సాగునీటి ప్రాజెక్టుల్లో, ₹1.43 లక్షల కోట్ల క్యాపిటల్ పరివ్యయంతో ముడిపడి ఉన్న (ఆధునికీకరణ పనులు, వరద గట్ల పనులు మినహా మిగతా జలయజ్ఞం ప్రాజెక్టుల అంచనా విలువలో **85** శాతం) 26 ప్రాజెక్టులను (**35** శాతం) నిధుల పరిమాణం, రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాల[2] ఆధారంగా ఎంపిక చేసి ఆడిట్ పరిశీలన చేయడం జరిగింది. ఈ 26 ప్రాజెక్టులకు సంబంధించి మొత్తం 278 ప్యాకేజీలకు కాంట్రాక్టులనివ్వగా అందులో 180 ప్యాకేజిలను (**65** శాతం) ఆడిట్ పరిశీలన కోసం ఎంపిక చేసుకోవడం జరిగింది. ఆడిట్ పరిశీలనకు ఎంపిక చేసుకున్న ప్రాజెక్టులు, ప్యాకేజిల వివరాలు ***అనుబంధం - 2.2*** లో ఉన్నాయి. మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులను (ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టెయిల్ పాండ్‌లు తప్ప) పైన ఇచ్చిన రాష్ట్ర పటంలో చూపడమైంది.

[2] పూర్తి అయిన 13 ప్రాజెక్టులు ఇందులో లేవు. వీటిలో కొన్నింటిని గత ఆడిట్‌లలో పరిశీలించడం జరిగింది